
ప్రజాశక్తి
శనివారం 22 మార్చి 2025





అసంపూర్తిగా ఉన్న జగనన్న ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



వైసిపిలో.. వేరుకుంపట్లు..!

◆ 'అనంత', రాయదుర్గం పురపాలికల్లో అసమ్మతి సెగలు

◆ ఛైర్మన్, మేయర్ మార్పు అంటూ ప్రచారాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారం పోయింది... గత సార్వత్రిక ఎన్నికల్లో ఎప్పుడూలేని విధంగా వైసిపి ఓటమిని చవిచూసింది. ఇలాంటి పరిస్థితుల్లో దీని నుంచి గట్టెక్కేందుకు ఐక్యంగా నిలబడాల్సిందిపోయి... వేరు కుంపట్ల పెట్టుకుంటున్నారు. ఇది అధికార తెలుగుదేశంకు సానుకూలంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం నగర పాలక సంస్థ, రాయదుర్గం పురపాలక సంఘంలో వైసిపి పాలకవర్గంగా ఉంది. ఆ పార్టీ మద్దతుదారులకు పూర్తిస్థాయి మెజార్టీ ఉండటంతో అధికార మార్పిడి జరిగే అవకాశం లేదు. అయితే ఇటీవల వైసిపి సొంత కార్పొరేటర్లు, కౌన్సిలర్లే రెండుగా విడిపోయి అసమ్మతిని రాజేస్తుండటం గమనార్హం. దీన్ని అధికార తెలుగుదేశం పార్టీ వారికి అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాల్లో ఉంటోంది.

రాయదుర్గంలో బహిరంగంగా గ్రూపు తగాదాలు

రాయదుర్గం పురపాలక సంఘంలో అత్యధిక మెజార్టీ వైసిపికి ఉంది. మున్సిపల్ ఛైర్మన్‌గా పొరాళ్ల శిల్ప ఉన్నారు. ఆమెకు వ్యతిరేకంగా ఒక గ్రూపు ఉంది. కౌన్సిల్ సమావేశాల్లోనే బాహాటంగా ఇరువర్గాలు ఘర్షణకు దిగుతున్న సందర్భాలూ ఉన్నాయి. ఇంతటి వివాదం నడుస్తున్నా కౌన్సిలర్ల మధ్య సయోధ్య కుదుర్చాల్సిన నియోజకవర్గ సమన్వయకర్త కనిపించడం లేదు. దీంతో కొంత మంది నియోజకవర్గ నాయకులు సమన్వయకర్తను మార్పు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధిష్టానం ఈ విషయంపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురు చూస్తున్నారు.

'అనంత'లో చెలరేగి...ఆగిన మంటలు

అనంతపురం నగర పాలక సంస్థ పాలకవర్గంలో చీలికలొచ్చాయి. నగర మేయరు వసీంపై అవిశ్వాసం ఏర్పాటు చేయాలని వైసిపి కార్పొరేటర్లే ప్రయత్నాలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం 18 మందితో సంతకాలు కూడా తీసుకున్నారు. అవిశ్వాసం పెట్టడానికి మూడోంతులు మెజార్టీ అవసరం కానుంది. అంత మెజార్టీ వచ్చే పరిస్థితుల్లేకపోవడంతోపాటు, పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి జోక్యం చేసుకని అందరినీ సమన్వయపరచి అవిశ్వాస సెగలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఇక అవిశ్వాసం పెట్టడం సాధ్యంకాదని తెలిపోవడంతో సంతకాలు చేసిన వారందరూ మేయర్ వద్దకు చేరడం గమనార్హం. దీంతో అనంత కార్పొరేషన్‌లో అధికార మార్పిడికి అవకాశం లేకుండాపోయింది. ఈ మొత్తం వ్యవహారాన్ని టిడిపి జాగ్రత్తగా గమనిస్తూ వచ్చింది. మార్పు చేయాలంటే వారికి ఆ పార్టీ తరుపున గెలుపొందిన ఒక్క కార్పొరేటరూ లేకపోవడంతో మౌనంగా ఉందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో నడుస్తోంది. వైసిపి నుంచే చీలికొచ్చి తమవైపు మెజార్టీ వస్తే అప్పుడు చూద్దామన్నట్టు గమనిస్తూ ఉంది.

ఇంకా ఏడాది గడువు..

స్థానిక సంస్థల పదవీకాలం ముగియడానికి మరో ఏడాది సమయముంది. ఇటువంటి తరుణంలో వైసిపిలో నెలకొన్న ఈ గందరగోళం రానున్న ఎన్నికలకు తమకు లాభిస్తుందని అధికార టిడిపి ఎదురు చూస్తోంది. ఆ పార్టీలో అనైక్యత నెలకొంటే ఎన్నికల్లో తాము లాభపడవచ్చునని భావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓటమిని చవిచూసిన వైసిపి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమిష్టిగా ఏ రకంగా ఎదుర్కొనుందన్నది చూడాల్సి ఉంది.

జగనన్న ఇళ్లను పేదలకు ఇవ్వండి

◆ ప్రభుత్వం స్పందించకుంటే తామే స్వాధీనం చేయిస్తాం

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. జగనన్న కాలనీ ఆలమూరు వద్ద ఉన్న ఇళ్ల నిర్మాణాలను సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సిపిఎం బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం నగరం, నారాయణపురం, రాజీవ్ కాలనీ, రుద్రంపేట గ్రామాలకు సంబంధించి 24వేలకుపైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలంతో పాటు ఇళ్లను నిర్మించి ఇస్తామని గత ప్రభుత్వం ఆలమూరు, ఉప్పరపల్లి, కొడిమి, కామారుపల్లి, కక్కలపల్లి ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందన్నారు. ఇళ్ల నిర్మాణ పనులను వివిధ కంపెనీలకు చెందిన కాంట్రాక్టర్లకు అప్పజెప్పిందన్నారు. ఈ పనులు చేపట్టిన గుత్తేదారులు నాసిరకంగా నిర్మాణాలు చేశారన్నారు. ఆలమూరు గ్రామానికి సమీపాన ఉన్న కొండ దగ్గర 7వేల ఇళ్ల స్థలాలను మంజూరు చేసి ఇప్పటివరకు వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. 7 వేల ఇళ్లు మంజూరు అయితే ఇక్కడ 70 నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యి లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. ఈ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని చెప్పారు. రోడ్లు, నీరు, విద్యుత్ తదితర సదుపాయాలు లేక ప్రజలు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. పనులు ఆగిపోవడంతో ఇళ్ల నిర్మాణాల కోసం తెచ్చిన సామగ్రి వృథాగా మారుతోందన్నారు. సొంత డబ్బులు వెచ్చించి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను రూ.30వేలు గుత్తేదారులకు ఇస్తే తప్పా ఇవ్వడం లేదన్నారు. దీనిపై అధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణం పూర్తి అయిన వాటిని లబ్ధిదారులకు తక్షణం ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులను సమీకరించి తామే ఇళ్ల స్వాధీన కార్యక్రమాన్ని చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట్ నారాయణ, ముత్తుజా, ఇర్ఫాన్, గోపాల్, ప్రకాష్ రెడ్డి, మసూద్, కక్కలపల్లి ఓబులేష్, బుల్లె రాజు, జీవ, వెంకటేష్, ఎన్‌టిఆర్ శీన, గఫూర్, ఎర్రిస్వామి, లక్ష్మి నారాయణ, లతీఫ్, ప్రజాశక్తి శీన, పెరుగు గోపాల్ పాల్గొన్నారు.



పది పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

'పది' పరీక్షలపై అలసత్వం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మారుతీ నగర్ మూడవ క్రాస్‌లో ఉన్న గుడ్ చిల్డ్రన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేసిన బల్లలు చాలా చిన్నవిగా ఉన్నాయని, వాటిని మార్చాలన్నారు. వెలుతురు సరిగా లేని రూముల్లో లైట్లు వేయాలన్నారు. పరీక్షలు నిర్వహించే ముందు విద్యాశాఖ అధికారులు ప్రతి పరీక్ష కేంద్రంలో వసతులను పరిశీలించాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ప్రసాద్ బాబు, అనంతపురం రూరల్ తహశీల్దార్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

810 మంది గైర్హాజరు..

జిల్లాలో 135 పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్‌లో 31,009 గాను 30,213 మంది హాజరు అయ్యారు. జిల్లావ్యాప్తంగా 810 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్‌తో పాటు జిల్లాస్థాయి పరిశీలకులు, జిల్లా విద్యాశాఖ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ తదితరులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నేడు ప్రపంచ జల దినోత్సవం

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నాడు జిల్లా వ్యాప్తంగా ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం, పల్లె పండుగ కార్యక్రమంపై కలెక్టర్లతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. శనివారం నాడు జిల్లా వ్యాప్తంగా ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామపంచాయతీలో 3 నుంచి 5 ఫారంఫండ్స్ పనులను గ్రౌండింగ్ జరగాలన్నారు. జిల్లాలో 9,000 లక్ష్యం కాగా, ఇప్పటిదాకా 6,864 ఫారంఫండ్స్ మంజూరు అవగా ప్రతి పంచాయతీలోనూ 3 నుంచి 5 ఫారంఫండ్స్ గ్రౌండ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పశువుల షెడ్లు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా నెలాఖరులోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, జెడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా రవాణా శాఖ అధికారులు సీజ్ చేసిన 76 వాహనాలను ఈనెల 25వ తేదీన ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు ఉపరవాణా కమిషనర్ ఎం.వీర్రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 76 వాహనాల్లో 24 వాహనాలు గుత్తి ఆర్టీసీ డిపోలో, 34 వాహనాలు అనంతపురం డిటిసి కార్యాలయంలో, 11 వాహనాలు కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో, 7 వాహనాలు రాయదుర్గం ఆర్టీసీ డిపోలో ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు నిబంధనల మేరకు వేలం పాటలో పాల్గొని వాటిని తీసుకోవచ్చున్నారు.

కల్వర్టు పరిశీలన

బొమ్మనహాల్ : మండలంలోని హెచ్ఎల్సీ ప్రధాన కాలువపై నిర్మించిన కల్వర్టును ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంవి రమణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా కర్ణాటక సరిహద్దు 105 కిలోమీటర్ల నుంచి 165వ కిలోమీటర్ వరకూ పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన ప్రమాదాల్లో కూలిపోయిన కల్వర్టులకు ప్రభుత్వరం రూ.3.9 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆయా పనులను రాబోవు జూన్ లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కణేకల్ సెక్షన్ డిఇ మద్దిలేటి, జెఇలు నరేంద్ర, మారుతి, నజీరుద్దీన్, అతావుల్లా, తదితరులు పాల్గొన్నారు.

'అనంత' అభివృద్ధికి నిధులు కేటాయించండి..

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనంతపురం పార్లమెంట్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో జలశక్తి మంత్రిత్వశాఖకు మంజూరైన నిధులపై శుక్రవారం జరిగిన చర్చలో అంబికా మాట్లాడుతూ అనంతపురం జిల్లా దేశంలోనే రెండవ అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతంగా ఉండటంతో ఇక్కడి రైతులు తీవ్రంగా నీటి సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. 2014-2019 మధ్య చేపట్టిన పలు ప్రాజెక్టుల ద్వారా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ విస్తరణ, డ్రిప్, స్ప్రింక్లర్ సాగుకు అధిక సబ్సిడీలు అందించామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం వరకు సబ్సిడీ ఇచ్చి బోరు సాగును ప్రోత్సహించామన్నారు. అలాగే పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి-కృష్ణానదులను అనుసంధానం చేసి రాయలసీమ భవిష్యత్తుకు మార్గదర్శనం చేసామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని, ముఖ్యమైన లిఫ్ట్‌పంపులు నిలిచిపోవడం, కాలువలు అసంపూర్తిగా ఉండటంతో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులు సత్వరంగా పూర్తయ్యేలా చూడాలని, అనంతపురం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకరించాలని కోరారు.

పార్లమెంటులో ఎంపి అంబికా



పార్లమెంటులో మాట్లాడుతున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

పెద్దవడుగూరులో ట్రాఫిక్ అస్తవ్యస్తం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఇబ్బడిముబ్బడిగా వస్తున్న వాహనాలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరులో రోజురోజుకూ ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇదివరకూ ఉన్న రహదారుల రూపురేకలు మారిపోవడంతో ప్రయాణం సాఫీగా సాగుతుండటం జాతీయ రహదారికి వెళ్లే వాహనాలు సైతం ఇటువైపు మళ్లించి ట్రాఫిక్ కలిగించేలా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడి రహదారి ఇరుకుగా మారడంతో అటూ ఇటూ వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ సమస్యపై పలువురు ఎన్నిమార్లు పోలీసు అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. ప్రస్తుతం రైతుల పొలాల నుంచి పశుగ్రాసం తరలిస్తుండగా బుధ, గురువారాల్లో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. గుత్తి సర్కిల్ ప్రాంతంలో ట్రాఫిక్ మరింత జఠిలంగా మారింది. పేటశివాలయం వెళ్లే రహదారిలో కూడా ట్రాఫిక్ అధికంగా ఉండటంతో శివాలయానికి మహిళా భక్తులు వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారు. ఈవిషయంపై ఎస్ఐ ఆంజనేయుల దృష్టికి తీసుకెళ్లగా ట్రాఫిక్ సమస్య లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కమిషనర్‌పై సమగ్రమైన విచారణ చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మహిళా ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నయామ్ అహమ్మద్‌పై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన కార్యదర్శి వర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ నయామ్‌అహ్మద్ బాధ్యతలు చేపట్టిన నుంచి కార్యాలయంలోని సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులను వేధింపులు గురి చేస్తూ దుర్భాషలాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ కమిషనర్ గతంలో పని చేసిన చోటు కూడా ఇంతకంటే దారుణంగా వ్యవహరించినట్లు ఎలక్ట్రానిక్ మీడియాలో కూడా వార్తలు వచ్చాయని గుర్తు చేశారు. మహిళా పారిశుధ్య కార్మికులపై చిన్నచూపుతో వివక్షతో ఉంటున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. అంతేగాకుండా కార్యాలయంలో ప్రతి శాఖ నుంచి ముడుపులు అందితేనే ఫైల్లు కదులుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయన్నారు. నెలరోజుల క్రితం దళిత సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మహిళా కౌన్సిలర్లు తమవార్డుల్లోని ప్రజా సమస్యలు తెలిపేందుకు వెళ్లినపుడు కమిషనర్ కనీస గౌరవం లేకుండా ఇంజనీరు వద్దకు వెళ్లి చెప్పాలని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వగా వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజాసంఘాల నాయకులు, కౌన్సిలర్లు సమస్యలపై విన్నవించుకునేందుకు వెళ్తే.. తనకు సంబంధించింది కాదు.. వేరే వాళ్లను కలవండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారంటే ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో తెలుస్తుందన్నారు. వెంటనే విచారించి కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 25న మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జగ్గిలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్




డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో డిఎంహెచ్ఒ ఇబి.దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారని, తెలిపారు. ఈ క్రమంలోనే వాక్సినేషన్ కోసం సింగనమల ఆశ కార్మికురాలు రోడ్డు ప్రమాదానికి గురైందన్నారు. 61 మంది ఆశాల వేతనాలు బకాయి పడ్డాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆశాలకు సంబంధం లేని పనులు చేయించకూడదన్నారు. 61 మందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. ప్రమాదానికి గురైన శింగనమల ఆశావర్కర్ పద్మావతికి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకట నారాయణ, ఆశా యూనియన్ నాయకులు కామాక్షి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం విధుల నుంచి మినహాయించండి

డిఇఒకు యుటిఎఫ్ నాయకుల వినతి



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు


ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దీర్ఘకాలిక వ్యాధులు, చంటిబిడ్డ తల్లులు, గర్భిణులు వంటి ఉపాధ్యాయులను పదవ తరగతి స్పాట్ వాల్యుయేషన్ విధుల నుంచి మినహాయించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని కార్యాలయంలో డిఇఒ ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా యుటిఎ ఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమ య్య మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు తీవ్రమైన అనారో గ్య సమస్యలు ఉన్న వారిని, 58ఏళ్లు దాటిన ఉపాధ్యాయులకు వాల్యుయేషన్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అలాగే తగినంత మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించాలని, టిఎ, డిఎలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు నాగేంద్ర, ఆడిట్ కమిటీ సభ్యులు గంగాధర్, ఎపి మోడల్ స్కూల్ నాయకులు వెంకటేశులు, శివానంద, వివిధ మండలాల నాయకులు పవన్, పవన్‌కుమార్, రాజేంద్ర, శ్రీనివాసులు, ఆదిశేషయ్య, నాగేంద్ర, వీరేశ్వరాచారి, మహమ్మద్ గౌస్, శివకుమార్, సంపత్‌కుమార్, జగదీశ్వరరెడ్డి, విజయుడు, వెంకట్‌నాయుడు పాల్గొన్నారు.

పెన్నహోబిలం హుండీ లెక్కింపులో గోల్‌మాల్‌పై విచారణ

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరవకొండ మండల పరిధిలోని పెన్నహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు సందర్భంగా భక్తులు నిలువు దోపిడీ ద్వారా సమర్పించిన బంగారు నగల మాయం ఘట నపై శుక్రవారం విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశా ల మేరకు ఉరవకొండ తహశీల్దార్ మహబూబ్‌బాషా విచారించారు. ఈ సందర్భంగా నగలు కౌంటింగ్‌లో రాకుండా ఎలా మిస్సయ్యాయి, ఎలా దొరికాయి.. తిరిగి వాటిని మరలా హుండీలోకి ఎలా చేర్చారనే అంశాలపై ఆలయ ఇఒ, సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం విచారణ అధికారి మాట్లాడు తూ సమగ్రంగా విచారించిన తరువాత నివేదికను జిల్లా అధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.



హుండీ లెక్కింపుపై విచారణ చేస్తున్న తహశీల్దార్ మహబూబ్‌బాషా

తాడిపత్రిలో టిడిపి, వైసిపి వర్గాల ఘర్షణ

ప్రజాశక్తి-తాడిపత్రి



టిడిపి కౌన్సిలర్లతో మాట్లాడుతున్న ఎఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి

తాడిపత్రిలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. వైసిపి కౌన్సిలర్ ఫయాజ్ బాషా తన ఇంటిని అక్రమంగా నిర్మించుకున్నారని తొలగించేందుకు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, టిడిపి కౌన్సిలర్లు హిటాచి వాహనంతో ఫయాజ్ ఇంటికి చేరుకున్నారు. అయితే తన ఇంటికి అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పాయని అధికారులను అడ్డుకున్నారు. జి ప్లస్ వన్ పర్మిషన్ తీసుకుని రెండో అంతస్తులు నిర్మించారని, కూల్చాల్సిందే అని టిడిపి కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో ఫయాజ్, టిడిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో సంప్రదించి శాంతి భద్రతలు అదుపుతప్పకుండా చర్యలు చేపట్టారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. ఈ దశలో పరిస్థితి అదుపుతప్పి ఫయాజ్ ఇంటిపై దాడి చేశారు. రాళ్లు రువ్వుతూ వాహన అద్దాలు ధ్వంసం చేశారు. ఇంటికి బిగించిన సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి పరిస్థితి అదుపులోకి తెచ్చారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి

రాయదుర్గం : పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఆర్ఎంపి వైద్యుడి వైద్యం వికటించి మూడేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గుమ్మగట్ట మండలం గలగల గ్రామానికి చెందిన వన్నూరు స్వామి, లక్ష్మి దంపతుల కుమార్తె అనుశ్రీ (3 సంవత్సరాలు) జ్వరంతో బాధపడుతోంది. చిన్నారిని చికిత్స నిమిత్తం రాయదుర్గం బళ్ళారి రోడ్డు వద్ద ఉన్న ఆర్ఎంపి వైద్యుడు డాక్టర్ ఖలీల్ వద్ద తీసుకెళ్లారు. ఆర్ఎంపి వైద్యుడు రక్త పరీక్షలు జరిపి సెలైన్ ఎక్కించారు. కొంతసేపటికి చిన్నారి పరిస్థితి విషమం కావడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని ఆర్ఎంపి వైద్యుడు సలహా ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. ఆర్ఎంపి వైద్యుని వల్లే తమ కూతురు చనిపోయిదంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలి

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ జి.ప్రశాంతి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి విద్యార్థికీ కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ జి.ప్రశాంతి సూచించారు. ఆన్‌లైన్ వెబినార్‌లో భాగంగా శుక్రవారం స్థానిక జెఎన్‌టియులో 'ఏ నేషనల్ వెబినార్ ఆన్ ప్రాక్టికల్ పాస్సిబిలిటీస్ ఫర్ ఫాకల్టీ మెంబెర్స్ టు ఇంప్యాక్ట్ స్టూడెంట్స్, అకాడమిక్స్ అండ్ ఇన్సిట్యూషన్ త్రూ అండర్‌స్టాండింగ్ యు హెచ్‌వి'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ కళాశాలల్లోని ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికీ ఇంజినీరింగ్ నుంచే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తే ఉన్నత శిఖరాలను చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య హరికుమార్ వోరుగంటి, యూనివర్సిటీ డైరెక్టర్లు బి.దుర్గాప్రసాద్, ఎస్‌వి సుబ్బారెడ్డి, ఇ.కేశవరెడ్డి, కె.శేష మహేశ్వరమ్మ, సరిత, జీపీ విష్ణునారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతివార్డులో చెత్త సేకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

నగరంలోని ప్రతివార్డులో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేపట్టాలని కమిషనర్ బి.బాలస్వామి సూచించారు. శుక్రవారం 6వ సర్కిల్ హమాలీ కాలనీలో డోర్ టు డోర్ చెత్త సేకరణను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ తప్పకుండా చెత్త సేకరణ చేపట్టాలని శానిటేషన్ సెక్రటరీని ఆదేశించారు. తర్వాత అక్కడి నుంచి ఈద్గా మసీదును సందర్శించారు. రంజాన్ పండుగకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం బుడ్డప్ప నగర్, డ్రైవర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు, జీసస్ నగర్, అరవింద్ నగర్, తదితర ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటేష్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడుదాం

ఉరవకొండ : రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడుకుందామని శ్రీ సత్యసాయి సేవాసంస్థ జిల్లా మెడికల్ కో ఆర్డినేటర్ ధనుంజయ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.రామకృష్ణ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, ఆర్ఆర్‌సి, రెడ్‌క్రాస్, సత్యసాయి సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంలాంటిదన్నారు. కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ క్యాక్రమంలో రెడ్‌క్రాస్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్ మస్తానప్ప, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటరాముడు, ఎం.పరమేష్, ఉపన్యాసకులు ఎస్.నారాయణస్వామి, జె.కృష్ణవేణి, అధ్యాపకులు పి.రమేష్‌బాబు, కె.సుజాత, అయ్యన్న, వెంకటేశులు, సీతారామ్‌గుప్తా, శ్రీనివాసరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వ్యకాసం ఆధ్వర్యంలో సచివాలయాల్లో వినతులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు



ఎపిఒ శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయంలో గ్రామ సెక్రటరీకి వ్యకాసం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, పనిముట్లు ఇవ్వాలని, వేసవి అలవెన్స్ 30శాతం పర్సెంట్ ఇవ్వాలని, కూలీలకు ప్లే స్లిప్పులు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోషల్ ఆడిట్ ద్వారా వెలికితీసిన డబ్బులను రికవరీ చేయాలని, అవినీతి, అక్రమాలను పాల్పడిన వారిని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కివిక్ మీటర్ రేటు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి దస్తగిరి, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి యాదవ్, వ్యకాసం ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, కృష్ణనారాయణ, రైతుసంఘం మండల అధ్యక్షులు మద్దిలేటి, నాయకులు పెద్దయ్య, రంగస్వామి, హరిగోపాల్, శివకృష్ణ, నందగోపాల్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : పది వారాలు పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఒ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, నాగరాజు, సావిత్రి, ఆదినారాయణ, సూర్యనారాయణ, రామాంజి, సంధ్యారాణి, సుబ్బమ్మ, నిర్మల, సుధారాణి, కిష్టన్న, ధనలక్ష్మి, వీరాంజి, నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్ రూరల్ : మండల పరిధిలోని నెలగొండ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను సమస్యలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించంచారు. తర్వాత పంచాయతీ కార్యదర్శికి బి.రామాంజనేయ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, నాయకులు బి.శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, కెవిపిఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రామునాయక్, జంగిలి రమేష్, కూలీలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని పంపనూరు, వడ్డుపల్లి గ్రామాల సచివాలయాల్లో ఆయా సెక్రటరీలకు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల సెక్రటరీ శివశంకర్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి హెచ్ రామయ్య, అనంతయ్య, ఓబులేసు, రాజు, తిప్పయ్య, నారాయణమ్మ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ అడిషనల్ సెక్రటరీతో అనంత ఎంపీ భేటీ



వినతిపత్రం అందజేస్తున్న ఎంపి అంబికా

అనంతపురం రూరల్ : పంచాయతీ రాజ్ అడిషనల్ సెక్రటరీ సుశీల్‌కుమార్ లోహని, జాయింట్ సెక్రటరీ అలోక్ ప్రేమ్‌నగర్‌తో అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి అసమర్థ పాలన వల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన పంచాయతీరాజ్ నిధులను సరిగ్గా వినియోగించకపోవడంతో సుమారు రూ.1617.54 కోట్ల నిధులు తిరిగి వెనక్కి వెళ్లిపోయాయన్నాఉ. ఆంధ్రప్రదేశ్‌కు సహాయంగా రూ.1,678.51 కోట్లు మంజూరు చేయగా కేవలం రూ.60.87 కోట్లు మాత్రమే ఉపయోగించుకున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల చేయాలని, పంచాయతీ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

నార్పల : చేనేతలకు ఉచిత విద్యుత్, ముడి సరుకు సబ్సిడీ, ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద 50 వేల రూపాయలు అదనంగా మంజూరు చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట్ నరసానాయుడు, సాగునీటి సంఘం అధ్యక్షులు ఆలం నాగార్జున నాయుడు, మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, నాయకులు శ్రీనివాసులు, బొగ్గు నారాయణస్వామి, పిఎల్ లక్ష్మీనారాయణ, చంద్రమోహన్‌రెడ్డి, వెంకట శివ, కుళ్లాయప్ప, తుంపెర నాగేష్, నాగేంద్ర, జయరాం, ఆది, నడిమింటి రాము, తలారి మహేష్, నల్లపరెడ్డిపల్లి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

జూదం జోలికెళ్లొద్దు

నార్పల : యువత జూదంతోపాటు అసాంఘి కార్యకలాపాల జోలికి వెళ్లకుండా భవిష్యత్తును బంగారు భవిష్యత్తు చేసుకోవాలని ఎస్ఐ సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కాలంలో చాలామంది యువకులు సులువైన మార్గంలో డబ్బు సంపాదించాలన్న దురాశతో ఆన్‌లైన్ బెట్టింగులు, లోన్ యాప్‌లకు అలవాటు పడి అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారన్నారు. తద్వారా వారిని నమ్ముకున్న కుటుంబ సభ్యులను బజారు పాలవుతున్నారన్నారు. కావున యువత, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలన్నారు.

రాయదుర్గం మీదుగా ప్రత్యేక రైలు

రాయదుర్గం : ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని రాయదుర్గం మీదుగా మైసూరు విజయపుర నడుమ ప్రత్యేక రైలు సర్వీసు నడపనున్నట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ ముఖ్య సమాచార అధికారి మంజునాథ్ కనమడి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైన్ నెంబర్ 06567 ఈనెల 28న శుక్రవారం సాయంత్రం 7:10కు మైసూరులో బయలుదేరి మండ్య కెంగేరి, బెంగళూరు (ఎస్‌బిసి), యశ్వంతపూర్, తుంకూరు, అరసికేరే, బీరూరు, చిక్క జాజూరు, చిత్రదుర్గ, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, తోరనగల్, హొస్పేట, కొప్పల్, గదగ్, బాదామి, బాగల్కోట్ మీదుగా శనివారం మధ్యాహ్నం 2-05కు విజయపుర చేరుతుంది. ట్రైన్ నెంబర్ 06568 మార్చి 31వ తేదీ సోమవారం సాయంత్రం ఏడు గంటలకు విజయపురలో బయలుదేరి పై తెలిపిన మార్గంలోని బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం2-20 గంటలకు మైసూరు చేరుతుందన్నారు. ఈ మార్గంలోని ప్రయాణికులు పండుగ సందర్భంగా నైరతి రైల్వే ఏర్పాటుచేసిన ప్రత్యేక రైలుసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఉరవకొండ : 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతితోపాటు ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిహెచ్‌డబ్ల్యు ఫిమేల్‌కు సంబంధించి కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఉరవకొండ కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.ధనలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

శింగనమల : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టెన్త్ పబ్లిక్ పరీక్ష కేంద్రాలను శింగనమల సిఐ కౌలుట్లయ్య తనిఖీ చేశారు. జెడ్పీహెచ్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కెజిబివి పాఠశాలలను పరిశీలించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, పర్సులు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ చితంబరయ్య, సిబ్బంది రాజేష్, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మెడ్స్ ఫార్మసీ ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతం



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అతిథులు

అనంతపురం : అనంతపురంలోని బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో రెండు రోజులపాటు నిర్వహించిన మెడ్స్ ఫార్మసీ సంస్థ క్యాంపస్ నియామకాలు విజయవంతంగా నిర్వహించాయి. ఈ డ్రైవ్‌లో 70 మంది విద్యార్థులు పాల్గొనగా 40 ఉద్యోగాలు సాధించారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ. 2.4 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకూ లభించనుంది. ఈ కార్యక్రమంలో బాలాజీ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణకిషోర్, ప్రిన్సిపాల్ వి.శ్రీధర్, మేనేజ్‌మెంట్ ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ ప్లేస్‌మెంట్ భానుకిరణ్, ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జి వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : సిపిఎం



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో పలువార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధి కారులు చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని జెడ్.వీరారెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. తాగునీటి సమస్యలు పరిష్కరించి మురుగు కాలువలు, వీధిదీపాలతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.రేణుక, సి. రమేష్, ఎం.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే ఫ్రైడే తనిఖీ

యాడికి : పరిధిలోని కమలపాడు, చింతలాయపల్లి గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన డ్రైడే కార్యక్రమాన్ని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వెక్టార్ కంట్రోల్ హైజిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. తర్వాల కమలపాడులోని ఎఎన్ఎం ఎం ఎఫ్ టు డైరీ వెరిఫై చేశారు. ఎంఎల్‌హెచ్‌పి ఆర్డిటి మలేరియా కిడ్స్ ఎన్ఎస్ఓ కిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం జినత్, ఎంఎల్‌హెచ్‌పి భాగ్యలక్ష్మి, అంగన్వాడీ టీచర్ జినత్, ఆశా కార్యకర్త రంగమ్మ పాల్గొన్నారు.

23న బిబిఎస్, డిజిపి సంఘం ప్రధాన కార్యాలయం ప్రారంభం

పామిడి : అనంతపురంలో ఈనెల 23న భారతీయ భీమ్‌సేన, డీజీపీ సంఘం భారతీయ భీమ్ సేన ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు భారతీయ భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షులు సాకే ఓబులేసు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కావున జ్యోతిబాపూలే, బి.ఆర్ అంబేద్కర్ అభిమానులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ తప్పకుండా తరలిరావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రైల్లో నుంచి జారిపడి యువకుడు మృతి

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని తాడిపత్రి-కోమలి రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం గుర్తు తెలియని యువకుడు రైల్లో నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వివరాల కోసం ఆరాతీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74 ఉడేగోళం మధ్యానేశ్వరస్వామి ఆలయం ముఖ ద్వారం వద్ద కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, పంచాయతీ కార్యదర్శి వెంకట రాముడు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రెండవ రోజు అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లావణ్య మాట్లాడుతూ సమతుల్య ఆహారం పోషక లోపాలు 0 నుంచి ఆరేళ్లలోపు పిల్లల ఎత్తు, బరువు, పర్యవేక్షణ లోపపోషణ ఉన్న పిల్లలకు అందించే రక్షణ పోషకాహారం, సంరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి సూపర్‌వైజర్ శాంతమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.


బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ఎంపిపి పాఠశాలలో అంగన్వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం కూడా కొనసాగతింది. ఈ సందర్భంగా సిడిపిఒ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ శిక్షణలో అంగన్వాడీలు తెలుసుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగమణి, హేమలత, అన్నపూర్ణ, కౌసల్య, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు

పుట్లూరు : మండల కేంద్రంలోని పిఎసిఎస్ (సొసైటీ)లో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం క్వింటా పప్పుశనగ ధర రూ.5650గా నిర్ణయించినట్లు తెలిపారు.

కౌలు రైతు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ



వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

కౌలు రైతు రక్షణ కోసం నూతన కౌలు ముసాయిదా చట్టాన్ని అమలు చేయాలని శుక్రవారం మండల పరిధిలోని మోపింది సచివాలయంలో కౌలు రైతుసంఘం నాయకులు పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత శాసన సమావేశాలలో చట్టాన్ని అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో మొత్తం భూమిలో 70 నుండి 80 శాతం భూమి కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. ఆ కౌలు రైతుల రక్షణ కోసం గతంలో ఉన్న అన్ని చట్టాలను వైసిపి ప్రభుత్వం అన్యాయంగా రద్దు చేసిందన్నారు. పంట సాగు హక్కు చట్టం (సిసిఆర్‌సి) తీసుకున్న భూ యజమాని సంతకం తప్పనిసరి చేయడంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు పంపిణీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఈక్రాప్ పంట నమోదు చేసుకోవడానికి వీలు లేకుండా పోవడంతో బ్యాంకు రుణాలు, నష్టపరిహారం, పంటల బీమా, మద్దతు ధరలు ఏమీ పొందలేకపోయారన్నారు. ఎన్నికల ముందు టిడిపి నాయకులు (సిసిఆర్‌సి) చట్టాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు కౌలు రైతుల రక్షణ కోసం నూతన కౌలుచట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు మురళి, రవికుమార్, రామాంజనేయులు, సుంకప్ప, గెడ్డప్ప పాల్గొన్నారు.

సజావుగా మేజర్ పంచాయతీ వేలం

ప్రజాశక్తి-నార్పల

నార్పల మేజర్ పంచాయతీకి సంబంధించిన ఆదాయ వనరులకు సర్పంచు మన్నీల సుప్రియ అధ్యక్షతన శుక్రవారం 2025-26కు సంబంధించిన గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటలు సజావుగా సాగాయి. బస్టాండ్‌ను రూ.4,83,000కు పులిరాజు, సంత మార్కెట్‌ను 33,25,003కు కొండన్న, మూత్రశాలను రూ.1,20,000కు సుంకన్న దక్కించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పంచాయతీ కార్యాలయ ఆవరణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, ఇఒఆర్‌డి శైలజారాణి, కార్యదర్శి శ్యామల, ఉప సర్పంచు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌కు పరామర్శ

అనంతపురం కార్పొరేషన్ : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లును మేయర్ మహమ్మద్ వసీం శుక్రవారం పరామర్శించారు. ఇందులో భాగంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు కమల్ భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయండి

శింగనమల : మండల వ్యాప్తంగా అన్ని రైతు సేవాకేంద్రాల్లో రైతు రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని శింగనమల, వెస్ట్ నరసాపురం, ఆకులేడు రైతు సేవాకేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎపిఎఫ్ఆర్ రైతుల రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ అన్వేష్‌కుమార్, ఎంపిఇఒలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అనంత మెడికోల విజయాలు స్ఫూర్తిదాయకం

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మాణిక్యరావు

ప్రజాశక్తి-అనంతపురం



మెడికోలను అభినందిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు

అంతర కళాశాల రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాల్లో అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల మెడికోలు వాలీబాల్, కబడ్డీ, చెస్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో విజయాలు సాధించడం స్ఫూర్తి దాయకమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు అన్నారు. ఈనెల 8వతేదీ నుంచి విజయవాడలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం స్థానిక కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ లెవెల్‌లో చెస్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో ద్వితీయ బహుమతిని సాధించడం గర్వకారణమన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు షారోన్ సోనియా, తెలుగు మధుసూదన్ మాట్లాడుతూ కళాశాలకు మైదానం, కోర్టులను ఏర్పాటు చేస్తూ ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్ కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమన్నారు. చెస్ పోటీలో ద్వితీయ బహుమతి సాధించిన బి దీపక్, లోకేష్, శబరిష్, ఆనంద కష్ణ, టేబుల్ టెన్నిస్ లో ద్వితీయ బహుమతి సాధించిన పూర్ణ, టి ఎన్ చిద్విలాస్, మనీష్ బొహర, ఆగ్నే తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ వరదరాజులు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పప్పూరు రామాచార్యుల సేవలు చిరస్మరణీయం

మేయర్ మహమ్మద్ వసీం


ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

భారత స్వాతంత్ర్య సమరంలో చిరస్మరణీయ పాత్ర పోషించిన పప్పూరు రామాచార్యులు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. రామాచార్యులు వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, సింహాచలం దేవస్థాన బోర్డు మెంబరుగా పప్పూరు రామాచార్యులు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో జ్వాలాపురం శ్రీకాంత్, బాల సుబ్రమణ్యం, నాగ లింగయ్య, నాగేంద్ర, పూజారి వీరన్న, టివి.రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు

అనంతపురం : పప్పూరు రామాచార్యులు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, తెలుగు శాఖ అధ్యక్షులు హేమమాలి, శాశాల ఉపాధ్యక్షులు సహదేవుడు, అంకే శ్రీనివాస్, అధ్యాపకులు అంకే మదన్మోహన్, నాగభూషణం, మమత, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రయాణికులపై ఆర్టీసీ కండక్టర్ దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి-గుత్తి



దురుసుగా ప్రవర్తిస్తున్న ఆర్టీసీ కండక్టర్

ఎపిఎస్ ఆర్టీసీ డిపోకు ఎపి 02 జెడ్ 0170 చెందిన బస్సు కండక్టర్ ప్రయాణికులపై దురుసుగా వ్యవహరించాడు. స్థానిక పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి కరీముల్లా బస్సుపాసుతో బస్సులో కూర్చున్నాడు. అయితే కండక్టర్ ఈ బస్సు మీరు ఎక్కకూడదు మరో బస్సు ఎక్కాలంటూ హుకుం జారీ చేశాడు. మరో బస్సు బయలుదేరడం ఎందుకు ఆలస్యం అవుతుంది నేను ఫాస్టింగ్ ఉన్నాను.. అందుకు ఈ బస్సు త్వరగా వెళుతుందని ఎక్కాను అని సమాధానం ఇచ్చాడు. దీంతో ఆ విద్యార్థి పై కండక్టర్ రమణయ్య విరుచుకుపడ్డాడు. బస్సుపాస్ తీసుకుని విసిరేశాడు. తోటి ప్రయాణికులు నచ్చచెబుతున్నా నానా మాటలతో దుర్భాషలాడాడు. విద్యార్థిపై చేయి చేసుకునేందుకు వెళ్లాడు. తోటి ప్రయాణికులు అడ్డుకోవడంతో వివాదం సద్దుమణిగింది. విద్యార్థి బస్సు పాసు ఉన్నా కండక్టర్ దురుసుగా వ్యవహరించడం పై తోటి ప్రయాణికులంతా కండక్టర్‌పై మండిపడ్డారు. అంతటితో ఆగలేదు నేను బిఎస్ఎఫ్ రిటైర్డ్ ఉద్యోగిని ఎవ్వరికి చెప్పుకుంటావో చెప్పుకోండి.. నీ ఇష్టమొచ్చింది చేసుకో అంటూ ఐడి కార్డు చూపిస్తూ ప్రయాణికులందరిపై చిందులేశాడు.

సురక్షితంగా గమ్యం చేరండి : డీఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



వాహనదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యాలు చేరుకోవాలని అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు సూచించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు రూరల్ డీఎస్పీ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కళ్యాణదుర్గం రోడ్డు, ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆకుతోటపల్లి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ లకు దూరంగా ఉండాలన్నారు. ట్రిబుల్ రైడింగ్‌కు స్వస్తి పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ సిఐ ఎస్ఐలు శేఖర్, హేమంత్‌కుమార్, రాంబాబు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

బొమ్మనహాల్ : మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆటో డ్రైవర్లకు ఎస్ఐ నబీరసూల్ శుక్రవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లందరూ లైసెన్స్, ఆర్‌సి, బీమా కలిగి ఉండాలన్నారు. అతివేగంలో వెళ్లకూడదన్నారు. పరిమితికి మించి వాహనాలను తరలించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వారి సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ఎస్పీ, తాడిపత్రి ఎఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ నారాయణ నాయక్ మాట్లాడుతూ రోడ్డు వెంబడి తిరిగే ఆటోలు ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటోలో ప్రయాణికులతో వెళ్లే సమయంలో రోడ్డు నిబంధనలు తెలుసుకుని సురక్షితంగా ప్రయాణం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.